అలరించిన ముందస్తు సంక్రాంతి వేడుక

- ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో తెలుగు సంస్కృతి ఉట్టిపడేలా సంబరాలు
- జానపద నృత్యాలతో అలరించిన విద్యార్థినులు
- ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులురెడ్డి



విద్యార్థినులతో కలిసి సహపంక్తి భోజనం చేస్తున్న మున్సిపల్ చైర్మన్ పోలా

రాజంపేట టౌన్ : స్థానిక ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో ఆదివారం ఆ హాస్టల్ అధికారిణి పి.శోభారాణి ఆధ్వర్యంలో ముందస్తు సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెలుగుదనం ఉట్టిపడేలా విద్యార్థినులు దుస్తులు ధరించారు. సంస్కృతి, సాంప్రదాయాలను తెలియజేసే కార్యక్రమాలను నిర్వహించారు. తొలుత హాస్టల్ ఆవరణలో మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి భోగికుప్పకు నిప్పంటించి కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం విద్యార్థినులు సంక్రాంతి విశిష్టతను తెలియజేసేలా సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చారు. విద్యార్థులు చేసిన అత్తిరాసాలు, కర్జికాయలు, రవ్వలడ్డును అతిథులకు ఇచ్చి రుచి చూపించారు. హాస్టల్‌లో పల్లెటూరి వాతావరణం తీసుకొచ్చారు. అందులో భాగంగా రైతు ఎడ్లబండిపై ధాన్యం తీసుకెళుతున్నట్లు, హరిదాసు వేషధారణ వంటి బొమ్మలను థర్మకోల్‌తో తయారు చేశారు. ఈసందర్భంగా పోలా విద్యార్థినులనుద్దేశించి మాట్లాడారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రజల అభిరుచులు మారిపోతున్నాయని, అందువల్ల సంక్రాంతి పండుగ విశిష్టత, సాంప్రదాయాలు కనుమరుగయ్యే పరిస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటువంటి కార్యక్రమాలతో విద్యార్థులకు సంస్కృతి, సంప్రదాయలపై అవగాహన ఉంటుందన్నారు. కార్యక్రమాన్ని నిర్వహించిన హాస్టల్ అధికారిణి శోభారాణి ఆయన అభినందించారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ విద్యార్థినులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమాల్లో బాలికోన్నత పాఠశాల హెచ్ఎం లక్ష్మీదేవి, మున్సిపల్ వైస్ చైర్మన్ మర్రి రవి, కౌన్సిలర్లు సనిశెట్టి నవీన్ కుమార్, పెనిగిలపాటి పెంచలయ్యనాయుడు, న్యామతుల్లా, అబ్దుల్ మునాఫ్ పాల్గొన్నారు.



నృత్య ప్రదర్శన

మహాత్ముల ఆశయాలను కొనసాగించండి



డైరీని ఆవిష్కరిస్తున్న డీఈఓ రాఘవరెడ్డి

రాయచోటి అర్బన్ : జ్యోతిరావు పూలే, బాబాసాహెబ్ అంబేడ్కర్ లాంటి మహాత్ముల ఆశయాలను కొనసాగింపునకు ఉపాధ్యాయులు తమవంతు కృషి సల్పాలని డీఈఓ రాఘవరెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన బీటీఏ నేతలతో కలసి ఆసంఘం ముద్రించిన డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాత్ముల చిత్రపటాలతో తయారు చేయించిన డైరీ బాగుందన్నారు. పూలే దంపతులతో పాటు అంబేడ్కర్ సైతం ఎన్నో రకాల వివక్షలను ఎదుర్కొని మహత్తర ఆశయాలతో ఉన్నతస్థాయికి ఎదిగారన్నారు. ఈ కార్యక్రమంలో బీటీఏ జిల్లా, రాయచోటి నేతలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆలయ గోపుర నిర్మాణం పరిశీలన

ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి



రాజగోపుర నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

రాయచోటి : పట్టణంలోని వీరభద్రస్వామి ఆలయంలో రూ.1.58 కోట్లతో చేపట్టిన పశ్చిమ రాజగోపురం నిర్మాణ పనులను ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి పరిశీలించారు. ఆదివారం సాయంత్రం ఆలయ అభివృద్ధి పనులను ఆలయ చైర్మన్ విజయమ్మ, ఈఓ రమణారెడ్డిలతో కలిసి ఆయన పరిశీలించారు. త్వరలో నిర్మించనున్న వసతి గదుల సముదాయ అనుమతులు మంజూరు చేయాలని దేవాదాయ, ధర్మాదాయ కమిషనర్‌ను శ్రీకాంత్‌రెడ్డి ఫోన్ ద్వారా కోరారు. వెండి రథం తయారీపై ఆలయ అధికారులు, కమిటీతో శ్రీకాంత్ రెడ్డి చర్చించారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ పోలు సుబ్బారెడ్డి, మదనపల్లె వైఎస్సార్‌సీపీ పరిశీలకులు హబీబుల్లా ఖాన్, పల్లపు రమేష్, కౌన్సిలర్ ఆసీఫ్ అలీఖాన్, ఆలయ కమిటీ సభ్యులు సురేష్, నాగభూషణం, రత్నశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య పరీక్షలు చేస్తున్న డా. రెడ్డి వరప్రసాద్ బాబు

పెనగలూరు : మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. పెనగలూరులో శ్రీహరి మెడికల్ షాపు, తిరుపతికి చెందిన రేడియస్ ఆస్పత్రి వారు సంయుక్తంగా నిర్వహించిన ఈ ఉచిత వైద్య శిబిరానికి రోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ముఖ్యంగా ఊపిరితిత్తులకు సంబంధించిన డాక్టర్ రెడ్డి వరప్రసాద్ బాబు ఈ వైద్య శిబిరంలో పాల్గొనడంతో ఆస్మా ఉన్న వారు పెద్దసంఖ్యలో శిబిరానికి వచ్చారు. మొత్తం 310 మంది రోగులను పరీక్షించి, మందులను అందజేసినట్లు వారు తెలిపారు. జనరల్ సర్జన్ డా. సాయి ఈ వైద్య శిబిరంలో పాల్గొన్నారు. షుగర్ పరీక్ష, బీపీ వ్యాధిగ్రస్తులకు ఉచితంగా పరీక్షలు చేశారు. కార్యక్రమంలో హరి మెడికల్ షాప్ యజమాని రవి తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించండి



అవగాహన కల్పిస్తున్న సీఐ లింగప్ప

సంబేపల్లె : వాహనదారులు నిబంధనలు పాటించాలని, లేకుంటే చర్యలు తప్పవని రాయచోటి రూరల్ సీఐ లింగప్ప హెచ్చరించారు. స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆదివారం వాహనదారులకు నియమాలపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగి వాహనం నడపడం నేరమన్నారు. వాహనాలు నడిపేవారు ధృవపత్రాలను తమ వద్ద తప్పనిసరిగా ఉంచుకోవాలన్నారు. రోడ్డుపై వాహనాన్ని నిలిపి ట్రాఫిక్ గురిచేస్తే కఠినంగా వ్యవహరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ షరీఫ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

తైక్వాండోలో ప్రతిభ



బ్లాక్‌బెల్ట్ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు, గ్రాండ్ మాస్టర్లు

రాజంపేట టౌన్ : తైక్వాండోలో రాజంపేటకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచి బ్లాక్‌బెల్ట్‌కు ఉత్తీర్ణత సాధించారు. ఈ విషయాన్ని తైక్వాండో ఇన్‌స్ట్రక్టర్ ఎస్.జాహీద్ అలీ ఆదివారం ఇక్కడి విలేకరులకు తెలిపారు. సగినాల రిజ్వాన్, ధనకోటి జ్ఞానసాయి ఆచారి, కురుగుంట్ల మనోజ్‌కుమార్‌నాయుడు, షేక్ మహమ్మద్ హనీఫ్‌లు ఫస్ట్‌డాన్ బ్లాక్‌బెల్ట్‌కు ఉత్తీర్ణులైనట్లు తెలియజేశారు. ఈనెల 6వ తేదీ నుంచి విజయనగరంలో పోటీలు జరిగాయన్నారు.

కోడిపందెం ఆడుతున్న ఏడుగురు అరెస్టు

తంబళ్లపల్లి: కోడిపందెం ఆడుతున్న ఏడుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ రామక్రిష్ణారెడ్డి ఆదివారం తెలిపారు. ఆర్ఎన్ తండా పంచాయతీ గుడ్లవారిపల్లె సమీపంలో కోడిపందెం ఆడుతున్నట్లు సమాచారంతో సిబ్బందితో కలిసి దాడి చేసి, ఏడుగురు జూదరులను అరెస్టు చేసి, 3 వేల నగదు, మూడు కోళ్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆలయంలో దీపోత్సవం

మదనపల్లె సిటీ: ధనుర్మాసోత్సవాల్లో భాగంగా స్థానిక బర్మావీధిలోని షిర్డీ సాయి బాబా మందిరంలో ఆదివారం దీపోత్సవం నిర్వహించారు. శాంతారాంస్వామి ప్రవచనాలు వినిపించారు. ఉత్సవమూర్తులకు ప్రత్యేక అలంకరణ చేశారు.

‘అంగన్‌వాడీ’ దరఖాస్తుల ఆహ్వానం

లక్కిరెడ్డిపల్లె : ఐసీడీఎస్ ప్రాజెక్టు లక్కిరెడ్డిపల్లె పరిధిలోని నాలుగు మండలాలు లక్కిరెడ్డిపల్లి, గాలివీడు, రామాపురం, వీరబల్లి మండలాలలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్త, అంగన్‌వాడీ సహాయకురాళ్ల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానించారు. నాలుగు మండలాల పరిధిలో అంగన్‌వాడీ కార్యకర్త పోస్టులు 9, అంగన్‌వాడీ సహాయకురాళ్ల పోస్టులు 13 ఉన్నాయని, అంగన్‌వాడీ కార్యకర్తకు 10వ తరగతి, సహాయకురాలికి 7వ తరగతి అర్హతగా ఉందన్నారు. 13వ తేదీ సాయంత్రం 5 గంటలోపు ఐసీడీఎస్ ప్రాజెక్టు లక్కిరెడ్డిపల్లె వారి కార్యాలయంలో అప్లికేషన్లను సమర్పించవలసిందిగా సమగ్ర శిశు సంక్షేమ అభివృద్ధి అధికారిణి కోరారు. పూర్తి వివరాలకు కార్యాలయంలో సంప్రదించవచ్చన్నారు.

ఆలయాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు



లక్కిరెడ్డిపల్లె: గంగమ్మ తల్లిని దర్శించుకుంటున్న కడప డీఈఓ దేవరాజ్



చిన్నమండెం: దర్శనమిస్తున్న మల్లూరమ్మ

గంగమ్మను దర్శించుకున్న కడప డీఈఓ దేవరాజ్

లక్కిరెడ్డిపల్లె : మండలంలోని అనంతపురం గ్రామంలో వెలసిన కుర్నూతల గంగమ్మకు ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వందలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకొని బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కడప డీఈఓ దేవరాజ్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ నరసింహారెడ్డి, సర్పంచ్ వెంకటనారాయణ రెడ్డి, ఆలయ ఈఓ రవీంధర్ రాజులు భక్తులకు సౌకర్యాలు కల్పించారు. ఫిబ్రవరి 20, 21, 22వ తేదీల్లో జరగబోవు గంగమ్మ జాతర సందర్భంగా ముందస్తు ఏర్పాట్లలో ఆలయ సిబ్బంది ఉన్నారు. ఈనెల 21న పారువేట అమావాస్య ఉండటంతో ఆలయ పూజారులు అమావాస్య పూజలకు సిద్ధమయ్యారు.

మల్లూరమ్మకు ప్రత్యేక పూజలు

చిన్నమండెం : మండల పరిధిలోని మల్లూరు గ్రామం మాండవ్యానదిపై కొలువై ఉన్న శ్రీ మల్లూరమ్మ తల్లికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం కావడంతో అమ్మవారిని పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. మొక్కుబడులు తీరిన వారు అమ్మవారికి బోనాలు సమర్పించారు. వచ్చిన భక్తాదులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలను అందించారు.

విగ్రహ తొలగింపుపై ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు

- ఎమ్మెల్యే ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి
- విలేకరుల సమావేశంలో ప్రజాసంఘాలు



కమిషన్‌కు ఫిర్యాదు చేసిన పత్రాన్ని ప్రదర్శిస్తున్న ప్రజాసంఘాల నేతలు

రాయచోటి అర్బన్ : అంబేడ్కర్ విగ్రహాన్ని గుట్టుచప్పుడు కాకుండా అర్ధరాత్రి తొలగించి, చిత్రపటాన్ని చించివేసి అవమానపరిచిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేసినట్లు ప్రజాసంఘాల నేతలు తెలిపారు. ఆదివారం స్థానిక అంబేడ్కర్ చిత్రపటం వద్ద ప్రజాసంఘాల నేతలు విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి ఫిర్యాదుపత్రాన్ని ప్రదర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ అంబేడ్కర్ విగ్రహాన్ని తొలగించి, చిత్రపటాన్ని చించివేసి అవమానపరిచారన్నారు. అనంతర ఆందోళన నిర్వహిస్తున్న ప్రదేశానికి అధికారులతో వచ్చిన ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి విగ్రహ ఏర్పాటు హామీతో ఆందోళనలను విరమించగా నేటి వరకు విగ్రహ ఏర్పాటు చేయలేదన్నారు. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు ఎలాంటి అనుమతులు అవసరం లేదని గతంలోనే ఎస్సీ, ఎస్టీ కమిషన్ జిల్లా కలెక్టర్‌లు, ఎస్పీలకు సూచించిందన్నారు. కమిషన్ ఆదేశాలను తోసిపుచ్చి అధికారులు విగ్రహాన్ని తొలగించడం అన్యాయమన్నారు. ఎమ్మెల్యే ఇచ్చిన హామీ మేరకు విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని లేకుంటే పోరాటానికి సిద్ధమంటూ హెచ్చరించారు. సమావేశంలో ప్రజాసంఘాల నేతలు ఈశ్వర్, రామాంజనేయులు, కోటేశ్వరరావు, ఏపీ ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సురేష్, వడ్డెర విద్యావంతుల వేదిక నేతలు మారుతి, రెడ్డెయ్య, రామక్రిష్ణ, రైతు సంఘం నేత రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గురువారం నుంచి పశువుల సంత

మార్కెట్ కమిటీ అధ్యక్షుడు వండాడి వెంకటేశ్వర్లు



రాయచోటి టౌన్ : ఈనెల 12వ తేదీ గురువారం నుంచి పశువుల సంతను పునఃప్రారంభిస్తున్నట్లు రాయచోటి మార్కెట్ కమిటీ అధ్యక్షుడు వండాడి వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ గత సంవత్సరం సెప్టెంబర్ నెలలో పశువులకు లంపీ స్కిన్ వ్యాధి సోకడంతో సంతలు తాత్కాలికంగా ఆపాలని కలెక్టర్ గిరీషా పీఎస్ ఆదేశించారని తెలిపారు. వ్యాధి తగ్గుముఖం పట్టడంతోందని తెలియడంతో తిరిగి పునఃప్రారంభించాలని సూచించారన్నారు. ఈ సంతలో గేదెలు, ఎనుములు, గొర్రెలు, మేకలు అమ్ముకొనేందుకు అనుమతిస్తున్నామన్నారు. అయితే పాడి ఆవులకు మాత్రం అనుమతివ్వడం లేదని తెలియజేశారు.

చిన్నా, సన్నకారు రైతుల శ్రేయస్సే లక్ష్యం

చిన్నా, సన్నకారు శ్రేయస్సే మా లక్ష్యమని వండాడి వెంకటేశ్వర్లు తెలిపారు. ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి సహకారంవతో రైతు బజారు త్వరలో ప్రారంభిస్తున్నామన్నారు. ఈ రైతు బజారులో రైతులు నేరుగా తాము పండించిన కూరగాయలను, పండ్లను నేరుగా వచ్చి వ్యాపారం చేసుకోవచ్చుని చెప్పారు. కూరగాయలతోపాటు పండించిన పండ్లు సైతం విక్రయించవచ్చని సూచించారు. అలాగే మటన్ సెంటర్‌నూ ప్రారంభిస్తున్నామన్నారు.

పేద పిల్లలకు బట్టల పంపిణీ



బట్టలు పంపిణీ చేస్తున్న ఎస్పీ హర్షవర్ధన్ రాజు

రాయచోటి టౌన్ : రాయచోటి అయ్యప్ప సేవా సొసైటీ వారి ఆధ్వర్యంలో పేద పిల్లలకు బట్టలను పంపిణీ చేశారు. ఆదివారం పట్టణ పరిధిలోని అయ్యప్ప దేవాలయం ఆవరణలో 350 మంది పిల్లలకు బట్టలను అందజేశారు. జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పేద పిల్లలకు బట్టలు అందజేయడం అభినందనీయమని ఆయన అన్నారు. అయ్యప్ప సొసైటీ అధ్యక్షులు బసిరెడ్డి, పారిశ్రామికవేత్త మడితాటి శ్రీనివాసరెడ్డి, పీఆర్‌టీయూ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం కన్వీనర్ శ్రీనివాసుల రెడ్డి, కంకర నరసింహారెడ్డి, గోవింద్‌రెడ్డి, ట్రెజరర్ మల్లన్న, వైస్ ప్రెసిడెంట్ మణికంఠ, సెక్రటరీ అనిల్, సభ్యులు మురళీమోహన్‌రాజు, అశోక్, శివ, సురేష్, మేజర్ రవీంద్రానాయక్,పాల్గొన్నారు.

గడప గడపకు కార్యక్రమానికి అనుమతి

రాయచోటి : లక్కిరెడ్డిపల్లె మండల పరిధిలోని దప్పేపల్లె పంచాయతీలో నిర్వహించనున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి అనుమతి ఇవ్వాలని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి డీఎస్పీ శ్రీధర్‌ను అనుమతి కోరారు. ఆదివారం ఈ మేరకు ఎమ్మెల్యే గ్రామ పర్యటన వివరాలను తెలియపరుస్తూ డీఎస్పీకి వినతిపత్రం పంపించారు. ఈ నెల 9 నుంచి 12వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు తెలియపరిచారు. నిబంధనల ప్రకారం ప్రజలకు ఇబ్బంది లేకుండా కార్యక్రమాన్ని చేపడతామన్నారు. కార్యక్రమానికి అనుమతిస్తున్నట్లు డీఎస్పీ శ్రీధర్ తెలిపారు.

కమనీయం.. రంగనాథుని కల్యాణం



కల్యాణ మహోత్సవాన్ని తిలకిస్తున్న మహిళలు



వేదమంత్రాలతో స్వామివారి కల్యాణాన్ని నిర్వహిస్తున్న పురోహితులు

రాజంపేట టౌన్ : పట్టణంలోని తోట కల్యాణ మండపంలో ఆదివారం గోదాదేవి, మహాలక్ష్మీదేవి సమేత ప్రసన్న రంగనాథ స్వామి కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. తిరుప్పావై భక్తసేవా సమితి ఆధ్వర్యంలో స్వామివారి ఈ మహోత్సవం జరిగింది. ఈ సందర్భంగా తొలుత ఉత్సవమూర్తులను ప్రత్యేక పుష్పాలతో, పట్టువస్త్రాలతో శోభాయమానంగా అలంకరించారు. అనంతరం ప్రత్యేకంగా తయారు చేసిన వేదికపై ఉత్సవమూర్తులను కొలువుదీర్చారు. తితిదేకు చెందిన వేదపండితులు కల్యాణ క్రతువును ఘనంగా నిర్వహించారు. కల్యాణాన్ని తిలకించేందుకు రాజంపేట పట్టణ ప్రజలే కాక వివిధ గ్రామాల నుంచి దాదాపు రెండు వేల మందికి పైగా భక్తులు తరలివచ్చారు. కోలాటం, ఎదుర్కోలు మహోత్సవాలు ఆకట్టుకున్నాయి. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ ఆధ్యాత్మిక గాయకులు, గిన్నిస్ రికార్డు గ్రహీత కోటపాటి గోవిందదాస అన్నమయ్య సంకీర్తనలను ఆలపించారు. అనంతరం తీర్థప్రసాదాలు, అన్నప్రసాదాన్ని భక్తులకు అందజేశారు. ఎన్‌సీసీ అధికారి మేజర్ విజయభాస్కర్ ఆధ్వర్యంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ కేడెట్స్ భక్తులకు విశేష సేవలందించారు.

రోడ్డు సౌకర్య కల్పనకు చర్యలు

జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి



మార్గాన్ని పరిశీలిస్తున్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి

రాజంపేట రూరల్ : రోళ్ళమడుగు – పెద్దూరు గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించేందుకు చర్యలు చేపడతానని జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి తెలిపారు. రోడ్డు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్న గ్రామస్తులు సమస్యను కేపాటి దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఆయన ఆదివారం ఆ ప్రాంతాన్ని పరిశీలించి, అనంతరం విలేకరులతో మాట్లాడారు. మారుమూల గ్రామాలకు సైతం రోడ్డు సౌకర్యం కల్పించాల్సిన అవసరం ఉందాన్నారు. సంబంధిత అధికారులకు సమస్యను తెలియజేసి వెంటనే సమస్య పరిష్కరించాలని ఆదేశాలివ్వనున్నట్లు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారమే తన తొలి ప్రాధాన్యత అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రఘురామరాజు, మాజీ సర్పంచ్ బుర్రు నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు జీవీ.సుబ్బరాజు, ముప్పాల రమేష్ నాయుడు, బుర్రు శివ పాల్గొన్నారు.

అర్హులకు అసైన్డ్ భూములివ్వాలి

రాయచోటి అర్బన్ : అర్హులైన పేదలందరికీ వెంటనే అసైన్డ్ భూములను కేటాయించాలని సీపీఐ రాయచోటి నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగాళ్ళ శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఆదివారం సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో పాలకులు పేదలకు సాగుకు అనుకూలం కాని కొండలు, గుట్టలు, వాగులు పంపిణీ చేశారన్నారు. కొందరు పేదలకు మంజూరు చేసిన భూములు ఎక్కడున్నాయో వారికే తెలియదన్నారు. త్వరలో జరగనున్న 8వ విడత భూ పంపిణీలో అర్హులైన దళిత, గిరిజన, బీసీల కుటుంబాలకు ఒక్కొక్కరికి 3 ఎకరాల చొప్పున పంపిణీ చేయాలన్నారు. సమావేశంలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి జె.వెంకటేష్, తుమ్మల లవకుమార్, యాపరాల పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

12 నుంచి క్రికెట్ టోర్నమెంట్

పుల్లంపేట : జనవరి 12వ తేదీ నుంచి పుల్లంపేట మండల యూత్ ఆధ్వర్యంలో నారంరెడ్డి సుధాకర్‌రెడ్డి సహకారంతో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలియజేశారు. మొదటి బహుమతిగా రూ.20 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.10వేలు అందజేయనున్నట్లు తెలిపారు. ఆసక్తికలవారు రూ.1000లు ప్రవేశ రుసుము చెల్లించాలన్నారు. వివరాలకు 9000534823, 7995353438, 8897594213 నెంబర్లలో సంప్రదించలన్నారు.

పోటాపోటీగా ‘సిటిజన్’ కబడ్డీ పోటీలు



కబడ్డీ పోటీల దృశ్యం

నందలూరు(రాజంపేట) : నందలూరు జిల్లా పరిషత్ క్రీడా మైదానంలో సిటిజన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కబడ్డీ పోటీలు పోటాపోటీగా జరిగాయి. సంక్రాంతి సంబరాలు–2023 సందర్భంగా కబడ్డీ పోటీలు, ముగ్గుల పోటీలు, ఉట్టి కార్యక్రమాలను వరుసుగా చేపడుతున్నారు. తొలిరోజున కబడ్డీ పోటీలను చేపట్టారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి, కీర్తిశేషులు మాజీ సీఎం నందమూరి తారకరామారావు జ్ఞాపకార్థంగా సంక్రాంతి సంబరాలను సిటిజన్ అసోసియేషన్ నిర్వహిస్తోందని అధ్యక్షుడు పోతురాజు మస్తానయ్య, ప్రధాన కార్యదర్శి ఆర్ముగం విశ్వనాథ్‌లు ప్రకటించారు. తొలిరోజు ప్రారంభోత్సవ కార్యక్రమానికి నాయకులు మేడా విజయశేఖర్‌రెడ్డి, రాజంపేట ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు, రైల్వే సీనియర్ మెడికల్ ఆఫీసర్ డా.జయభాస్కరరావు, ఎస్ఐ మైనుద్దీన్, మండల ఉపాధ్యక్షుడు నాయనపల్లె అనుదీప్, సర్పంచి జంబు సూర్యానారాయణ, పునగాని గుణ యాదవ్, నందలూరు ఉప సర్పంచి ఇబ్బు, జుల్ఫీకర్ తదితరులు పాల్గొన్నారు. పోటీల్లో 13 కబడ్డీ జట్లు పాల్గొనగా మొదటి బహుమతిని జేజే లెవన్స్–కడప, ద్వితీయ బహుమతిని కోడూరు– 2, తృతీయ బహుమతిని కోడూరు– 1 జట్లు కైవసం చేసుకున్నాయి. విజేతలకు నగదు బహుమతితో పాటు జ్ఞాపికలను నిర్వాహకులు అందజేశారు.

యువకులు క్రీడల్లో రాణించాలి

క్రికెట్ టోర్నీని ప్రారంభించిన లక్కిరెడ్డిపల్లె మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి



బ్యాట్‌పట్టిన మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి

రామాపురం : మండలంలోని కల్పనాయినిచెరువు గ్రామంలో ఆదివారం లక్కిరెడ్డిపల్లె మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి వైఎస్సార్ క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. మాజీ ఎమ్మెల్యేను కమిటీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ యువకులు క్రీడల్లో రాణించాలని, జీవితంలో సరైన ఎంపికలుంటేనే భవిష్యత్తును మార్చుకోగలరన్నారు. క్రీడల్లో చురుగ్గా పాల్గొనడం వలన మంచి ఫిట్‌నెస్ పొందుతారన్నారు. కార్యక్రమంలో లక్కిరెడ్డిపల్లె మార్కెట్ కమిటీ చైర్మన్ విశ్వనాథరెడ్డి, వైస్ ఎంపీపీ బాబు, సర్పంచ్ వెంకట్రామిరెడ్డి, మాజీ సర్పంచ్‌లు వెంకటసుబ్బారెడ్డి, కృష్ణయ్య, కమిటీ సభ్యులు చెన్నారెడ్డి, వెంకటనారాయణరెడ్డి, ప్రకాష్ రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, రాఘవ, చిన్నప్ప, చలపతి జనార్ధన్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి కోసం మహిళల నిరసన



నిరసన తెలుపుతున్న మహిళలు

సిద్దవటం : మండలంలోని ఉప్పరపల్లె గ్రామంలోని దళితవాడలో గత వారం రోజులుగా తాగునీరు రాకపోవడంతో ఆదివారం కాలనీ మహిళలు ఖాళీ బిందెలతో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ తాము తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. బిందె రూ.10 చెల్లించి క్యాన్ వాటర్ తెచ్చుకుంటునామన్నారు. గ్రామంలో తాగునీటి పైప్‌లైన్ పగిలిపోయి నెలరోజులు కావస్తున్నా మరమ్మతు చేయించలేదన్నారు. సంక్రాంతి పండుగను దృష్టిలో ఉంచుకొని అధికారులు కాలనీని సందర్శించి పైప్‌లైన్‌కు మరమ్మతు చేసి తాగునీరు అందిచాలని కోరారు.

మాలల సింహగర్జనను విజయవంతం చేయాలి



రౌండ్‌టేబుల్ సమావేశంలో నేతలు

రాజంపేట రూరల్ : దళిత జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించే మాలల సింహగర్జన విజయవంతం చేయాలని దళిత నేతలు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ఆర్ అండ్ బీ అతిథి గృహంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఇందులో అంబేడ్కర్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు పోలంరెడ్డి మల్లికార్జున, ఉపాధ్యక్షుడు లింగం సంజీవ్, దళిత నేతలు ఆర్ముగం విశ్వనాథ్, పిల్లి చంద్రశేఖర్, కాకిచంద్ర, జట్టి చిరంజీవి, గాలిశెట్టి సుధాకర్, శంకరయ్య, సుబ్బయ్య, మాలమహానాడు యువత ప్రతినిధి హరినాథ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాలలు తమ ఐక్యతను చాటుకునే విధంగా ముందుకుసాగాలని పిలుపునిచ్చారు. మాలలు తమ సత్తాను చాటే విధంగా బహిరంగసభ నిర్వహిద్దామని తెలియజేశారు.

జూదరుల అరెస్ట్

పెద్దమండ్యం: జూదం ఆడుతున్న నలుగురిని ఆదివారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ పి. వెంకటేష్ తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కోటకాడపల్లె పంచాయతీ తాటిమాకులపల్లెకు సమీపంలో జూదం ఆడుతున్నట్లు అందిన సమాచారం మేరకు సిబ్బందితో వెళ్లి దాడులు నిర్వహించినట్లు తెలిపారు. దాడుల్లో జూదం ఆడుతున్న నలుగురు పట్టుబడ్డారు. వీరి నుండి రూ.1,50,300 నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అలాగే మండలంలోని అవికేనాయక్‌తండా పంచాయతీలోని దేనేనాయక్ తండాకు సమీపంలో కోడిపందెం ఆడుతుండగా సిబ్బందితో వెళ్లి దాడులు నిర్వహించినట్లు తెలిపారు. దాడుల్లో కోడిపందెం ఆడుతున్న ముగ్గురు పట్టుబడగా, వీరి నుండి రూ.8,300ల నగదు, రెండు కోడిపుంజులు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.